క్లుప్తంగా

ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి


కేక్ కట్ చేస్తున్న నాయకులు

కదిరి టౌన్: స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ కదిరప్ప ఆధ్వర్యంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 80వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి జయంతి వేడుకలు జరుపుకున్నారు. ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, ఉపేంద్ర, తిప్పన్న, శ్రీనివాసులు, సాయి, దేవా, చంటి తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో గ్రామాలు

అమడగూరు: మండలంలో సోమవారం కురిసిన వర్షానికి పలు గ్రామాలన్నీ అంధకారంలోకి వెళ్లాయి. కొట్టువారిపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న సానేవారిపల్లి, బాలప్పగారిపల్లి, ఎగువ, దిగువ గువ్వలపల్లి, గ్రామాలకు విద్యుత్ సరఫరా లేదు. సోమవారం రాత్రి 7.30 గంటల నుంచి విద్యుత్ లేకపోవడంతో ప్రజలంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 24 గంటలు గడుస్తున్నా కరెంట్ రాకపోవడంతో విద్యుత్ అధికారుల తీరుపై మండిపడుతున్నారు.

మరువెళ్లిన పేరంవాండ్లపల్లి చెరువు


మరువ పారుతున్న పేరంవాండ్లపల్లి చెరువు

అమడగూరు: మండలంలోని పేరంవాండ్లపల్లి చెరువ మరువ పారుతోంది. సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పైనున్న కర్ణాటక చెరువుల నుంచి ఎక్కువగా నీరు రావడంతో మంగళవారం 10 గంటలకు చెరువు మరువ ప్రారంభమైంది. మరువ పారుతున్న నీరంతా ఏ కొత్తపల్లి చెరువుకు చేరుతున్నాయి. గతేడాది వర్షాలు కురవక పోవడంతో చెరువులన్నీ ఎండిపోయాయి. అయితే ఈ సారి కేవలం ఒక్కరోజుకే నీరంతా చెరువుకు రావడం, మరువ పారడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తులు చెరువు మరువ దగ్గరకు వచ్చి పూజలు చేశారు. కాగా సోమవారం రాత్రి మండలంలో 99 ఎంఎం వర్షపాతం నమోదైనట్లు అధికారులు పేర్కొన్నారు.

ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని వినతి


మంత్రికి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

కదిరి టౌన్: మహిళలపై వేధింపులకు సంబంధించి విచారణకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని బీజేపీ కిసాన్‌మోర్చా ఆర్గానిక్ సెల్ స్టేట్ కన్వీనర్ చింతా శరత్‌కుమార్‌రెడ్డి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను కోరారు. ఈమేరకు మంగళవారం కరీంనగర్‌లోని మంత్రి స్వగృహంలో ఆయనకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా శరత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా మహిళలపై రోజురోజుకూ వేధింపులు పెరిగిపోతున్నాయన్నారు. బయటకు వెళ్లిన మహిళలు, విద్యార్థినులు ఇంటికి క్షేమంగా వస్తారో లేదో తెలియని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. మహిళలపై అత్యాచారం, హత్యలపై విచారణకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి దోషులను త్వరితగతిన శిక్షించాలని కోరారు.

ఘనంగా రాఘవేంద్రస్వామి ఆరాధన


అలంకరణలో రాఘవేంద్రస్వామి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీలోనున్న మంత్రాలయ రాఘవేంద్ర స్వామి ఆలయంలో మంగళవారం 353వ ఆరాధనను ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త పద్మనాభ ఆచారి ఆధ్వర్యంలో రాఘవేంద్రస్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. మూడురోజులపాటు ఆరాధన మహోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గాంధీనగర్‌లోని రాఘవేంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

మహిళపై దాడి

తనకల్లు: కోటపల్లిలో శంకరమ్మపై అదే గ్రామానికి చెందిన మనోజ్, అనసూయమ్మ, చిన్నక్క మంగళవారం దాడి చేసి గాయపరిచారు. వివరాలు... శంకరమ్మ పొలం దగ్గర ఒంటరిగా పనిచేస్తుండగా వారు డబ్బు విషయంలో ఆమెతో వాదనకు దిగి కొడవలితో తల, ముఖంపై దాడి చేశారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన శంకరమ్మను కదిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

‘గాలికుంటు’తో పశువులకు ప్రమాదం

- సకాలంలో చికిత్స అవసరం
- 20 నుంచి నివారణ టీకాలు
- పశు వైద్యాధికారి గుర్నాథరెడ్డి


రాఘువంపల్లిలో పశువులకు గాలికుంటు టీకా వేస్తున్న వైద్యాధికారి గుర్నాథరెడ్డి(ఫైల్)

బత్తలపల్లి: పశువులకు గాలికుంటు వ్యాధి సోకితే పోషకులకు నష్టం తప్పదని బత్తలపల్లి పశువైద్యాధికారి గుర్నాథరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన ‘సాక్షి’తో మాట్లాడుతూ పశువులకు సోకే గాలికుంటు వ్యాధి లక్షణాలు, దీని నివారణకు తీసుకోవాల్సిన చర్యలను ఆయన వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో పశువులకు గాలికుంటు వ్యాధి సోకే అవకాశం ఎక్కువగా ఉంది. ఎఫ్ఎండీ, ఆర్ఎన్ఏ వైరస్‌తో గాలి ద్వారా ఈ వ్యాధి వ్యాపిస్తుంది.

■ గాలి ద్వారా వ్యాప్తి..

గాలి ద్వారా ఈ వ్యాధి వ్యాపిస్తుందని, అందుకే దీన్ని గాలికుంటు వ్యాధిగా పిలుస్తారు. వాతావరణంలో ఒక్కసారిగా ఏర్పడిన మార్పులు, వర్షాలు, గ్రామాల్లో లోపించిన పారిశుధ్యంతో వ్యాధి సులభంగా వ్యాప్తి చెందుతుంది. ఈ వ్యాధి సోకితే పశువులు మేత మేయలేవు, ఎక్కువ సేపు నిలబడలేవు. చికిత్స సకాలంలో అందించకపోతే పశువుల ప్రాణానికే ప్రమాదం. వ్యాధి నివారణ కోసం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి సెప్టెంబర్ 20 వరకు ఉచితంగా టీకాలు వేస్తున్నారు.

■ వ్యాధి లక్షణాలు..

గాలికుంటు వ్యాధి సోకిన పశువులకు ఒక్కసారిగా జ్వరం పెరుగుతుంది. పశువులకు 104 నుంచి 106 డిగ్రీల టెంపరేచర్ ఉంటుంది. పశువుల నాలుక, చిగుర్లపై పుండ్లు వస్తాయి. పశువుల కాళ్ల గిట్టల మధ్యలో పుండ్లు ఏర్పడతాయి. దీనితో పశువులు మేత మేయలేవు. నడవలేవు. ఎండలకు తట్టుకోలేవు. సకాలంలో ఎదకు రావు. ఈ లక్షణాలు కనపడగానే పశువులను వెంటనే పశువుల వైద్యాధికారికి చూపించి చికిత్స చేయించుకోవాలి. వ్యాధి సోకిన పశువులను మిగతా పశువులకు దూరంగా ఉంచాలి. లేదంటే ఆరోగ్యంగా ఉన్న పశువులకు ఈ వ్యాధి సోకే ప్రమాదం ఉంటుంది.

■ నివారణ చర్యలు..

గాలికుంటు వ్యాధి సోకినట్లు అనుమానం వస్తే వెంటనే పశువైద్యాధికారిని సంప్రదించి పరీక్షలు చేయించాలి. వాటి నివారణకు మందులు వేయాలి. పోటాషియం ఫర్మాంగనేట్ ద్రావకంతో పుండ్లను శుభ్రం చేయాలి. నాలుకపై బోరోగ్లిసరిన్ పూత మందు పూయాలి. ఈగలు వాలకుండా వేపనూనే వాడాలి. గాలికుంటు వ్యాధి నివారణకు ప్రభుత్వం ఆరు నెలలకోసారి అంటే సంవత్సరానికి రెండుసార్లు టీకాలు వేస్తోంది. వ్యాధి నివారణ కోసం ఆక్సిటెట్రాసైక్లిన్, నిముసులైడ్ ఇంజెక్షన్లు వాడుకోవాలి. లివర్ టానిక్‌లు వాడడం వలన వ్యాధి నుంచి పశువులను త్వరగా కాపాడుకోవచ్చు.

నిబంధనలకు విరుద్ధంగా ‘సర్దుబాటు’


నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయ బృందం

గాండ్లపెంట: స్థానిక ఎంఈఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన పని సర్దుబాటు ప్రక్రియ నిబంధనలకు వ్యతిరేకంగా ఉందని జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈసందర్భంగా వారు సర్దుబాటు ప్రక్రియపై నిరసన తెలియజేశారు. హైస్కూల్ ప్లస్ ఉన్నత పాఠశాలలకు మినహాయింపు ఇవ్వాలని తెలియజేసినా ఎన్‌రోల్‌మెంట్ సాకుతో నిబంధనల్లో చూపని అంశం ద్వారా పని సర్దుబాటు చేశారని ఆరోపించారు. మండల విద్యాధికారి క్రిష్ణానాయక్ పని సర్దుబాటులో మిగులు ఉపాధ్యాయుల స్థానంలో సీనియర్ టీచర్ల అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకోకుండా జూనియర్ (ఫిజికల్ సైన్స్) టీచర్లను పని సర్దుబాటులో మిగులుగా చూపి నిబంధనలకు వ్యతిరేకంగా కౌన్సెలింగ్ చేపట్టారన్నారు. తెలుగు సీనియర్ ఉపాధ్యాయుడిని జూనియర్‌గా చూపి కౌన్సెలింగ్ నిర్వహించారన్నారు. ఉన్నతాధికారులు ఎంఈఓకు తగిన సూచనలు ఇచ్చి ప్రస్తుతం జరిగిన పని సర్దుబాటు ప్రక్రియను రద్దు చేయాలని ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు డిమాండు చేశారు.

సర్దుబాటు విధానంలో మార్పుచేయాలి

పుట్టపర్తి: మిగులు ఉపాధ్యాయుల సర్దుబాటు మార్గదర్శకాల్లో ప్రభుత్వం మార్పు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఏపీయూఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్‌బాబు మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. అధికారులు ఒక వేళ సర్దుబాటు చేసినా మండల స్థాయిలోనే చేయాలని డిమాండ్ చేశారు. అర్హత కలిగిన ఎస్‌జీటీలను బలవంతంగా ఉన్నత తరగతులకు సర్దుబాటు చేయొద్దని, వారు ఇది వరకే పదోన్నతులు వదులుకున్నారని గుర్తు చేశారు.

నల్లమాడ: మండలంలో ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియ పూర్తయినట్లు ఎంఈఓలు వేమనారాయణ, సురేష్‌బాబు తెలిపారు. ఉన్నత పాఠశాలల్లో 11 మంది పాఠశాల సహాయకులు, ప్రాథమిక పాఠశాలల్లో 14 మంది ఎస్జీటీలను మిగులు ఉపాధ్యాయులుగా గుర్తించినట్లు పేర్కొన్నారు. మండలంలో ఓ సాంఘిక ఉపాధ్యాయుడు, నలుగురు సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయులు అవసరం ఉండగా మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. పని సర్దుబాటులో భాగంగా నల్లమాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఓ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలిని, గోపేపల్లి, మసకవంకపల్లి, నల్లసింగయ్యగారిపల్లి, కుటాలపల్లి తాండా ప్రాథమిక పాఠశాలకు ఒక్కొక్కరు చొప్పున ఎస్జీటీలను సర్దుబాటు చేసినట్లు ఎంఈఓలు వివరించారు.

ఉత్సాహంగా బాలికల అథ్లెటిక్స్ పోటీలు


విజేతలతో ప్రిన్సిపాల్, ఆర్డీటీ సిబ్బంది

కనగానపల్లి/రామగిరి: ఆర్డీటీ ఆధ్వర్యంలో బాలికల రూరల్ అథ్లెటిక్స్ పోటీలను ఉత్సాహంగా నిర్వహించారు. మంగళవారం నసనకోట మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల రెసిడెన్షియల్ పాఠశాల ఆవరణలో పోటీలు జరిగాయి. కనగానపల్లి, రామగిరి మండలాల్లోని ఉన్నత పాఠశాలల విద్యార్థినులు పాల్గొన్నారు. క్రీడాకారులను అండర్- 14, అండర్- 16 విభాగాలుగా విభజించి ఈ పోటీలు నిర్వహించినట్లు పీడీ మాధవరాజులు తెలిపారు. అండర్- 14 విభాగం లాంగ్‌జంప్‌లో భవనకృతి, షాట్‌పుట్‌లో చైతన్యశ్రీ(ఎంజేపీ పాఠశాల, నసనకోట) గెలుపొందగా, అండర్- 16లో లాంగ్‌జంప్ అమృత (మోడల్ స్కూల్, కనగానపల్లి), షాట్‌పుట్‌లో రామేశ్వరమ్మ (కేజీబీవీ, కనగానపల్లి), 60 మీటర్ల పరుగు పందెంలో బ్రాహ్మణి (జెడ్పీహెచ్ఎస్, తగరకుంట), 100 మీటర్ల పరుగులో వంశిక (కేజీబీవీ, కనగానపల్లి), 200 మీటర్ల పరుగులో సుకన్య (ఎంజేపీ పాఠశాల) ప్రథమ స్థానంలో నిలిచి పతకాలు సాధించారు. ఈ ఎంజేపీ పాఠశాల ప్రిన్సిపాల్ అమీనాబేగం, ఆర్డీటీ ఏటీఎల్ పద్మావతి, సీఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి తీవ్రగాయాలు

బత్తలపల్లి: అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై మండల కేంద్రంలోని పంజాబ్ దాబా వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. ఈదుల ముష్టూరు గ్రామానికి చెందిన చిన్నా బత్తలపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. బత్తలపల్లికి రావడానికి ఆటో ఎక్కాడు. ఆటో కదిరి రోడ్డులోని దొడ్ల పాలడైరీ వద్దకు వెళ్లి తిరిగి బత్తలపల్లికి కూడలికి రాంగ రూటులో వస్తోంది. ఇదే సమయంలో అనంతపురం నుంచి కదిరి వైపు వెళుతున్న కారును ఢీ కొంది. ప్రమాదంలో ఆటోలో ఉన్న చిన్నాకు తీవ్రగాయాలు అయ్యాయి. వెంటనే స్థానికులు ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. తర్వాత అనంతపురం తీసుకెళ్లారు.

గుర్తు తెలియని వ్యక్తికి తీవ్రగాయాలు

బత్తలపల్లి: అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై మండల కేంద్రం సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. బత్తలపల్లి నుంచి అనంతపురం వైపు స్కూటీ(ఏపీ 39ఎస్‌డి 3012)పై గుర్తు తెలియని వ్యక్తి బయలుదేరాడు. బత్తలపల్లి దాటిన తరువాత బైపాస్ రోడ్డు పనులు జరుగుతుండగా వాటిని గమనించకుండా వేగంగా దూసుకుపోయి డివైడర్‌ను ఢీ కొన్నాడు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికుల సహకారంతో పోలీసులు ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. అనంతరం అనంతపురం ఆసుపత్రికి తీసుకెళ్లారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

ఎన్‌పీకుంట: విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎస్ఐ శ్రీధర్ విద్యార్థినులకు సూచించారు. మంగళవారం స్థానిక కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినులకు రోడ్డు భద్రతా నియమాలు, ర్యాగింగ్, వ్యక్తిగత పరిశుభ్రత, గుడ్ బ్యాడ్ టచ్, మాదక ద్రవ్యాల వలన కలిగే నష్టాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

ఫ్రీ హోల్డ్ రైట్స్ భూముల పరిశీలన

ఓడీచెరువు: మండలంలోని వెంకటాపురం, తిప్పేపల్లిలో ఫ్రీ హోల్డ్ రైట్స్ భూములను మంగళవారం ఆర్డీఓ భాగ్యరేఖ పరిశీలించారు. ఫ్రీ హోల్డ్ కింద నమోదైన భూముల్లో అయా రైతులే అనుభవంలో ఉన్నారా లేక ఇతరులు ఎవరైనా ఉన్నారా అన్న దానిపై ఆమె విచారణ చేపట్టారు. డిప్యూటీ తాహసీల్దార్ జాకీర్, సిబ్బంది పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాల తనిఖీ

తలుపుల: స్థానిక కస్తూర్బా పాఠశాలను ఐఈడీ కోఆర్డినేటర్ ఆనంద్‌బాబు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేయడంతో పాటు భోజనశాలను పరిశీలించారు. విద్యార్థినులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎస్ఓ మోహనమ్మకు సూచించారు. అనంతరం ఎంఆర్‌సీ భవన్ సందర్శించి విద్యాపరంగా చేపట్టాల్సిన చర్యలపై ఎంఈఓలు వెంకట్రాముడు, విజయ్ కుమార్‌కు సూచనలు చేశారు. తర్వాత భవిత సెంటర్‌ను తనిఖీ చేశారు. ఐఈఆర్టీ భారతి ఉన్నారు.

సచివాలయాల తనిఖీ

నల్లచెరువు: పి.కొత్తపల్లి, అల్లుగుండు గ్రామ సచివాలయాలను ఇంచార్జ్ ఈఓఆర్డీ నసీమా మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

పుట్టపర్తి టౌన్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ మునిచంద్రిక సూచించారు. మంగళవారం ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. సీహెచ్ఓ నగేష్, పీహెచ్ఎన్ లలితకుమారి, ఎస్‌యూఓ రమణయ్య పాల్గొన్నారు.

కేసు నమోదు

కదిరి అర్బన్: ఫ్లెక్సీల విషయంలో కదిరికి చెందిన వజీర్, అలీ, ఆకాష్ అనే వ్యక్తులు తమపై దాడి చేశారంటూ కాలేపల్లికి చెందిన వెంకటరమణ, సుశీలమ్మ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ముగ్గురు నిందితులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు రూరల్ అప్‌గ్రేడ్ సీఐ మోహన్ తెలిపారు. కాగా వెంకటరమణ, సుశీలమ్మపై సైతం కౌంటర్ కేసు నమెదు నమెదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

కాలిపోయిన ఫ్యాన్‌లు, ఫ్రిడ్జిలు

నల్లమాడ: మండల కేంద్రంలోని మెయిన్ బజార్‌లో సోమవారం రాత్రి విద్యుత్ హై ఓల్టేజీతో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి టీడీ కేశవరెడ్డి, అదే బజారులో ఉండే శ్రీకాంత్‌రెడ్డి, ఆనంద్ తదితరుల ఇళ్లలో 12 ఫ్యాన్‌లు, రెండు ఫ్రిడ్జిలు, 30 పైగా బల్బులు కాలిపోయాయి. విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం మూలంగా మండలంలో విద్యుత్ సరఫరా రోజురోజుకు అస్తవ్యస్తంగా తయారవుతోందని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. మంగళవారం ఉదయం నుంచి రాత్రి 7 గంటల వరకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఉక్కపోతతో పాటు తీవ్ర అసౌకర్యానికి గురైనట్లు దుకాణాదారులు, చేతి వృత్తుల వారు తెలిపారు.

ఉపాధి పనుల ఎంపికపై 23న గ్రామసభలు

బత్తలపల్లి: ఉపాధి హామీ కింద 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కొత్త పనులు ఎంపిక, ఆమోదం కోసం ఈ నెల 23న గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సాయిమనోహర్, ఏపీఓ ఆదెప్ప మంగళవారం తెలిపారు. అప్పరాచెరువు, బత్తలపల్లి-1, డి.చెర్లోపల్లి, దంపెట్ల, గరిశలపల్లి, మాల్యవంతం, ముష్టూరు, నల్లబోయనపల్లి, ఓబుళాపురం, పోట్లమర్రి, సంగాల, సంజీవపురం, తంబాపురం గ్రామ పంచాయతీ కేంద్రాల్లో ఉదయం 11 గంటలకు గ్రామసభలు ప్రారంభమవుతాయన్నారు.

తలుపుల: మండలంలో ఉపాధి హామీ కింద 2024-25లో ఉపాధి పనుల గుర్తింపుపై ఈ నెల 23న ఉదయం 11 గంటలకు గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కిరణ్‌మోహన్‌రావు మంగళవారం తెలిపారు. సర్పంచ్ అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహిస్తామని, సచివాలయ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది తప్పకుండా హాజరు కావాలని కోరారు.

తనకల్లు: మండలంలోని 17 గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఈ నెల 23న గ్రామసభలను నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటరమణ మంగళవారం తెలిపారు. కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ సిబ్బంది సమన్వయంతో ఉపాధి హామీ పనులపై కూలీలు, ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.

అభయ కేసు నిందితులను కఠినంగా శిక్షించాలి


బత్తలపల్లి కూడలిలో మాట్లాడుతున్న ఆర్డీటీ కౌన్సిలర్ శోభారాణి

బత్తలపల్లి: కోల్‌కతాలో అభయ పట్ల అత్యాచారం, హత్యకు పాల్పడిన నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఆర్డీటీ సిబ్బంది, విద్యార్థులు నినదించారు. మంగళవారం స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఆర్డీటీ ఆధ్వర్యంలో ర్యాలీలు, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏటీఎల్ రుక్మాంగద, కౌన్సిలర్ శోభారాణి, మురళి తదితరులు మాట్లాడుతూ ప్రాణాలను కాపాడే వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను ఇప్పటి వరకు అరెస్టు చేయకపోవడం దారుణమన్నారు. దేశవ్యాప్తంగా మహిళల పట్ల రోజురోజుకూ హింసలు పెరిగిపోతున్నాయన్నారు. అనంతరం ఆర్డీటీ సిబ్బంది, విద్యార్థినులు కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. సీఓలు నాగరాజు, వెంకటేష్, మహిళా సాధికారిత ఎస్టీఎల్ వెంకటేష్, గంగాధర్, సీబీటీలు వీరనారప్ప, వెంకటలక్ష్మీ, ఓబులమ్మ, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

నల్లమాడ: కోల్‌కతాలో డాక్టర్‌పై అత్యాచారం, హత్య ఘటనను నిరసిస్తూ మంగళవారం నల్లమాడలో ఆర్డీటీ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. సంస్థ ఏరియా కార్యాలయం నుంచి బస్టాండ్ కూడలి మీదుగా ప్రధాన వీధిలో ర్యాలీ జరిగింది. బస్టాండ్ కూడలిలో విద్యార్థులు మానవహారంగా ఏర్పాడ్డారు. ఈ సందర్భంగా ఏటీఎల్ వన్నూరు స్వామి, సీఓ శ్రీనివాసులు మాట్లాడుతూ మహిళలపై తరచూ జరుగుతున్న దాడులను ఖండించారు. ఆర్డీటీ సిబ్బంది గంగప్ప, నరసింహులు, కుళ్లాయమ్మ, అనిత, ప్రభుత్వ జూనియర్ కళాశాల, కస్తూరిబా పాఠశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

ఓడీచెరువు: కోల్‌కతాలో డాక్టర్‌పై అఘాత్యానికి పాల్పడిన కామాంధులను కఠినంగా శిక్షించాలని కోరుతూ మంగళవారం ఓడీచెరువులోని విద్యార్థులతో పాటు ఉద్యోగులు, ఉపాధ్యాయులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఓడీచెరువు యువసైన్యం, హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు లడ్డు బాబాజాన్, ఆరిఫ్, ఆసిఫ్, ఎస్వీబీ ప్రిన్సిపాల్ రామకృష్ణ, గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ: కోల్‌కతాలో డాక్టర్‌పై హత్యాచారం, హత్య సంఘటనను నిరసిస్తూ మంగళవారం ఆర్డీటీ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కొవ్వొత్తులు డాక్టర్‌కు నివాళులర్పించారు. ఆర్డీటీ ఏటీఎల్ కృష్ణ, సీఓలు రమణ, శ్రీరాములు, అంజినప్ప, పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలి


పాఠశాల వద్ద ధర్నా చేస్తున్న పీఎస్‌యూ నాయకులు

ధర్మవరం అర్బన్: ప్రైవేటు కోచింగ్ సెంటర్ నడుపుతున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలని పీఎస్‌యూ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మంజుల నరేంద్ర డిమాండ్ చేశారు. పట్టణంలోని కొత్తపేట మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాల ముందు మంగళవారం పీఎస్‌యూ నాయకులు ధర్నా చేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు రామకృష్ణ ప్రభుత్వ వేతనం తీసుకుంటూ పాఠశాలకు వెళ్లకుండా అనంతపురంలోని సాయిగంగా కోచింగ్ సెంటర్ పేరుతో తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. ఈయనపై గతంలో ఫిర్యాదులు వచ్చినా విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టలేదన్నారు. ప్రభుత్వం ఇచ్చే జీతం తీసుకుంటూ పేద విద్యార్థులకు సరైన విద్య నందించకుండా విద్యార్థులకు నష్టం చేకూరుస్తున్న రామకృష్ణను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఓ జిల్లా కార్యదర్శి నిరంజన్, పీఎస్‌యు పట్టణాధ్యక్షుడు నందకిశోర్, సాయి, వంశి, ఆనంద్‌కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంచండి

పుట్టపర్తి టౌన్: తల్లిదండ్రులు చిన్నారులను సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంచాలని ఆల్ ఇండియా చిల్డ్రన్ ఫౌండేషన్ జిల్లా ప్రతినిధి కొండప్ప పేర్కొన్నారు. మంగళవారం సత్యసాయి మహిళా సమాఖ్య కార్యాలయంలో చిల్డ్రన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. మెప్మా అధికారి రమాదేవి, శిశుగృహ మేనేజర్ సునీత, ఐసీడీఎస్ సోషల్ వర్కర్ వనజాక్షి, యూత్ అంబాసిడర్ అన్సర్ బాషా, భరత్, కావేరి ప్రసంగించారు. చిన్నారులు అనునిత్యం మొబైల్ చాటింగ్, ఆన్‌లైన్ గేమ్‌లతో భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు.

‘ఎఫ్ఈఎస్’ సేవలు వినియోగించుకోండి

ఎన్‌పీకుంట: ఎఫ్ఈఎస్ సంస్థ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ నరేంద్రకుమార్ సూచించారు. సంస్థ ఆధ్వర్యంలో ఇండస్‌ఇండ్ బ్యాంక్ సహకారంతో తిమ్మమ్మమర్రిమానులో మంగళవారం స్కేల్(ఎస్.సీ.ఏ.ఎల్.ఈ) ప్రాజెక్టును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎఫ్ఈఎస్ సంస్థ తరపున ఏర్పాటైన పల్లె సంఘాల ద్వారా 14 పంచాయతీల్లో రూ.3.99 కోట్లతో వివిధ రకాల పనులు చేపడతామన్నారు. సర్పంచ్ విష్ణుమూర్తి, ఇండస్‌ఇండ్ బ్యాంక్ ప్రతినిధి అక్లాక్, ఎఫ్ఈఎస్ స్టేట్ హెడ్ వలి తదితరులు పాల్గొన్నారు.

చెరువును తలపిస్తున్న ముక్తాపురం


వర్షపు నీటితో నిండిన వీధి

కనగానపల్లి: ముక్తాపురంలో వర్షపు నీరంతా వీధుల్లోనే నిల్వ ఉండటంతో చెరువును తలపిస్తోంది. 44వ నంబరు జాతీయ రహదారికి పక్కనే ఉన్న ఈ గ్రామంలో సరైన రోడ్లు, డ్రైనేజీలు లేవు. వర్షాకాలం వచ్చిందంటే వర్షపు నీరంతా వీధుల్లోనే నిల్వ ఉంటోంది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రధాన వీధులన్నీ వర్షపు నీటితో నిండిపోయాయి. గ్రామ సచివాలయానికి వెళ్లే అధికారులు, వాహనదారులు, పాఠశాలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఉచిత శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు

బత్తలపల్లి: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ ఇన్ ఏపీ సంస్థ, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్ యోజన సంయుక్తంగా 4 నెలలు ఉచిత శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. ఈ మేరకు ఏపీఎం సుదర్శన్‌రాజు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రిటైల్ స్టోర్ మేనేజర్ కోర్స్, కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లిష్‌పై శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. శిక్షణలో భాగంగా ఉచితంగా ఏకరూప దుస్తులు(యూనిఫామ్), శిక్షణ మెటీరియల్, భోజన వసతి కల్పిస్తున్నారని తెలిపారు. ఏదైనా డిగ్రీ పాస్ అయి, వయస్సు 28 ఏళ్లలోపున్న వారు అర్హులని, ఈ నెల 22 నుంచి 24 వరకు ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు జాబ్స్ కో ఆర్డినేటర్ అనంతలక్ష్మి 7702100238, 9182316114 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

ట్రాఫిక్ నియంత్రణకు సహకరించండి


ఆటో డ్రైవర్లకు సూచనలిస్తున్న సీఐ నారాయణరెడ్డి

కదిరి టౌన్: పట్టణంలోని ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలని సీఐ డి.వి.నారాయణరెడ్డి ఆటోడ్రైవర్లకు సూచించారు. స్థానిక పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు, ఆటోడ్రైవర్లు తమ వాహనాలను రోడ్లపై ఎక్కడపడితే అక్కడ ఉంచడంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోందన్నారు. షాపుల ముందు వాహనాలు ఉంచరాదన్నారు.

గాండ్లపెంట: మండలంలోని ఆటో డ్రైవర్లు రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్ఐ క్రిష్ణవేణి సూచించారు. జిల్లా ఉన్నతాధికారుల పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి ఆటో కలిగిన వ్యక్తి డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా పొందాలన్నారు. పరిమిత సంఖ్యలో ప్రయాణికులను తరలించాలని, అతి వేగం ప్రమాదకరమన్నారు. ఏఎస్ఐ రంగానాయక్, హెచ్‌సీ తిరుమల రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు సహకరించండి

బత్తలపల్లి: ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తితే ఆటో డ్రైవర్లపై చర్యలు తప్పవని ఎస్ఐ శ్రీనివాసులు ఆటో డ్రైవర్లను హెచ్చరించారు. మంగళవారం బత్తలపల్లి కూడలిలో ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోలు ఇష్టారాజ్యంగా ఎక్కడపడితే అక్కడ ఆపితే జరిమానాలు విధిస్తూ కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆటోల్లో నిబంధనల మేరకు ప్రయాణికులను ఎక్కించుకోవాలన్నారు. ఏఎస్ఐ తిరుపాలు, హెడ్ కానిస్టేబుల్ షమీవుల్లా పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

కదిరి టౌన్: పట్టణంలోని అడపాలవీధికి చెందిన కె.నాగరాజు అదృశ్యమయ్యాడు. వివరాలు...నాగరాజు పెనుకొండ వద్ద ఉన్న కియా కంపెనీలో పని చేసేవాడు. ఈనెల 12న పనికి వెళ్తున్నానని చెప్పి తల్లి లక్ష్మీదేవికి చెప్పి వెళ్లాడు. తర్వాత ఇంటికి రాలేదు. సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్‌ల ఉండటంతో కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా గాలించినా ప్రయోజనం లేకపోయింది. మంగళవారం బాధితుడి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసిట్లు సీఐ డీవీ నారాయణరెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం జానకంపల్లి సమీపంలో మంగళవారం రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీ కొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు..కర్నాటకనాగేపల్లికి చెందిన సాయి గణేశ్ మరో వ్యక్తి కొత్తచెరువు నుంచి బుక్కపట్నం మీదుగా బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరారు. అదే సమయంలో కొత్తచెరువుకు చెందిన అజయ్ బైక్‌పై వస్తూ జానకంపల్లి సమీపంలో హంద్రీనీవా కాలువ బ్రిడ్జి వద్ద వారి బైక్‌ను ఢీకొన్నాడు. ఘటనలో సాయి గణేశ్,అజయ్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వారిని పుట్టపర్తి సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు.

ఈ-కేవైసీ చేయించుకోండి

కదిరి అర్బన్: సహకార సంఘాల్లో సభ్యత్వం ఉన్న ప్రతి సభ్యుడు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని సైదాపురం సొసైటీ సీఈఓ హనుమంతరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, బ్యాంక్ పాసుబుక్కు, 1బీ జిరాక్స్ కాపీలు, మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, నామినీ వివరాలు, సెల్ నెంబర్‌తో సొసైటీ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఈ-కేవైసీ చేయించుకోని వారు భవిష్యత్తులో ప్రభుత్వ ఇచ్చే రాయితీలు కోల్పోతారని పేర్కొన్నారు. వివరాలకు 9494799066 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.